రాష్ట్రాన్ని వంచిస్తున్న కేంద్రం

● అడగని వారికి భారీగా నిధులా? ● డీఎంకే నేత ఆర్ఎస్ భారతి ఆగ్రహం



చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కొత్త పథకాలు ప్రకటించకుండా, ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలకు నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపుతున్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి పేర్కొన్నారు. అడగని రాష్ట్రాలకు భారీగా నిధులు కేటాయించి, యేళ్లతరబడి నిధులడుగుతున్న రాష్ట్రాలను విస్మరించడం న్యాయమేనా? అంటూ కేంద్రంపై మండిపడ్డారు. ఆదివారం మధ్యాహ్నం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను ఖండిస్తూ శనివారం సాయంత్రం రాష్ట్రమంతటా 72 ప్రధాన నగరాల్లో చేపట్టిన నిరసన సభలు విజయవంతమయ్యాయన్నారు. వీసీల సెర్చికమిటీలకు సంబంధించి యూజీసీ ప్రకటించిన కొత్త నిబంధనలను ఖండిస్తూ ఢిల్లీలో జరిగిన ధర్నాలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ పాల్గొనటంతో ఆ ఆందోళనకు మంచి ఊపు వచ్చిందన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని, రాష్ట్రానికి మొండి చేయి చూపిందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి, టీచర్ల వేతనాలకు క్రమంగా విడుదల చేయాల్సిన నిధులను కూడా కేంద్రం నిలిపివేసిందని ఆర్ఎస్ భారతి ఆరోపించారు. అమెరికా నుండి విమానంలో భారతీయులను సంకెళ్లు వేసి తరలించిన దుర్ఘటనపై ప్రధాని మోదీ మౌనం పాటించడం సిగ్గుచేటన్నారు. తానొక తమిళ వనితనంటూ గొప్పలు చెప్పుకునే కేంద్ర విత్త మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో రాష్ట్రానికి చిల్లిగవ్వను కూడా కేటాయించకుండా, అసలు తమిళనాడు అనే పదాన్ని కూడా బడ్జెట్‌లో లేకుండా చేసి తమిళ ప్రజలకు తీరని అన్యాయం చేశారని ఆయన విమర్శించారు. తిరుప్పరంకుంద్రం వివాదంపై బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా రాష్ట్ర ప్రజలు ఆ పార్టీ నేతల ఆరోపణలు అవాస్తవాలని గ్రహించారన్నారు.

స్టాలిన్ నోట తెలుగు సామెత!

ఇదిలా ఉండగా రాష్ట్రానికి నిధుల ఊసేలేని బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్రంలోని బీజేపీ పాలకులను ఖండిస్తూ ఆవడిలో శనివారం రాత్రి జరిగిన సభలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలుగు సామెతతో కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్‌ను విమర్శించారు.. స్టాలిన్ తన ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడల్లా తిరుక్కురళ్ సూక్తులను ప్రస్తావించడం ఆనవాయితీగా పెట్టుకున్నారని, ఈ యేడాది తెలుగు కవి నినాదమైన 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అంటూ కొత్త పాట అందుకున్నారని, దేశమంటూ మనుషులని చెప్పిన మంత్రి తమిళనాట ఉన్నవారిని మనుషులుగా ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తనకు ఓ తెలుగు సామెత గుర్తుకువస్తోందంటూ 'పేరు పెద్ద.. తాగ నీరు లేదు' అన్నట్లు దేశ ప్రగతికోసం రూపొందించినట్లు గొప్పలు చెప్పుకోవటమే కానీ, ఆ బడ్జెట్‌లో ఎక్కడా ప్రగతికి సంబంధించిన అంశాలే లేవని స్టాలిన్ విమర్శించారు.

ఈరోడ్ ఈస్ట్‌లో

ఎన్టీకేకు పెరిగిన ఓటు బ్యాంకు

● సీమాన్ పార్టీకి రెట్టింపు మెజారిటీ ● అన్నాడీఎంకే ఓట్లే కారణమా?





ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్ సమీప ప్రత్యర్థిపై 91,558 ఓట్ల మెజార్టీతో ఘన విజయాన్ని సాధించారు. ఆయనతో పోటీపడిన నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) అభ్యర్థి సీతాలక్ష్మీకి 24,151 ఓట్లు రావడం చర్చాంశనీయాంశమైంది. అన్నాడీఎంకే ఓట్లే ఎన్టీకేకు పోలై ఓటు శాతం పెరిగిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2023లో ఈ నియోజకవర్గానికి ఈసీ ప్రకటించిన ఉప ఎన్నికల్లో డీఎంకే కూటమి తరుపున కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఈవీకేఎస్ ఇళంగోవన్ 1,10,156 ఓట్లతో గెలుపొందారు. ఆయన అకాల మరణంతో ఈ నియోజకవర్గానికి ఈ నెల 5న జరిగిన ఉప ఎన్నికలో పోలైన ఓట్లను లెక్కించి ఫలితాలను శుక్రవారం ఈసీ అధికారపూర్వకంగా వెల్లడించింది. ఈ ఉప ఎన్నికలో డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్‌కు తపాలా ఓట్లతో కలుపుకుని మొతం 1,15,709 ఓట్లు రాగా, ఆయన సమీప ప్రత్యర్థి ఎన్టీఏకు చెందిన సీతాలక్ష్మీపై 91,558 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,27,546 మంది ఓటర్లలో 1,54,657 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, బీజేపీ, డీఎండీకే తదితర పార్టీలు ఈ ఉప ఎన్నికలను బహిష్కరించిన నేపథ్యంలో ఎన్టీఏకు గతంలో జరిగిన ఎన్నికల్లో కంటే ఈసారి 2శాతం ఓటు బ్యాంకు పెరిగింది. దీనిపై విశ్లేషణ చేయగా పలు వాస్తవాలు వెలుగుచూశాయి. అన్నాడీఎంకే, బీజేపీకి చెందిన ఓటర్లు ఎన్టీకే అభ్యర్థికి ఓటు వేయడమే ఎన్టీఏ ఓటు బ్యాంకు పెరగడానికి కారణమని చెబుతున్నారు. ఈ పార్టీకి 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో 11,629 (7.65 శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయని, అదేవిధంగా 2023లో జరిగిన ఉప ఎన్నికల్లో 10,827 (6.35 శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ రీతిలో గతంలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం ఎన్టీకే ఓటు బ్యాంకు రెండింతలు పెరిగింది. ఇందుకు కారణం అన్నాడీఎంకే, బీజేపీల ఓట్లేనని తెలిసింది. 2023లో ఈరోడ్ ఈస్ట్‌కు జరిగిన ఉప ఎన్నికల్లో పోటీచేసిన అన్నాడీఎంకే అభ్యర్థి 43,923 ఓట్లు సాధించి డిపాజిట్ దక్కించుకున్నారు. అయితే అన్నాడీఎంకే ఉప ఎన్నిక బహిష్కరించిన నేపథ్యంలో ఈ ఓట్లన్నీ ఏమయ్యాయన్న ప్రశ్నకు సమాధానం దొరికింది. అన్నాడీఎంకే, బీజేపీ పార్టీలు తమ కార్యకర్తలను ఓటు హక్కును వినియోగించుకోవద్దని ఎలాంటి ఆదేశాలు చేయలేదని, అదే సమయంలో ఇష్టమున్న వారు నోటాకు వేయాలని పరోక్షంగా సూచించినట్లు తెలిసింది. మరోవైపు గత ఉప ఎన్నికలో ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గంలో కూటమి తరుపున పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్‌కు మద్దతుగా ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మిత్రపక్షాల నాయకులు దాదాపు వారంరోజులకు పైగా మకాంవేసి ప్రచారం చేశారు. ఈసారి అధికార డీఎంకేకు చెందిన ప్రముఖులు, మంత్రులు ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఏ పార్టీకి ఓటు వేసేందుకు ఇష్టపడని 6,109 మంది నోటాకు వేయగా, ఎన్టీకే అభ్యర్థి సీతాలక్ష్మి సహా ఇండిపెండెంట్ల డిపాజిట్లు గల్లంతు కావడం గమనార్హం.

నేడు మంత్రివర్గ సమావేశం

బడ్జెట్‌లో కొత్త పథకాలపై చర్చించే అవకాశం?

అడయార్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన సోమవారం ఉదయం జరుగనుంది. రాష్ట్ర శాసనసభ ఈ యేడాది తొలి సమావేశాలు గత నెల 6న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమై 11వ తేదీతో ముగిశాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు జరుగనుంది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధితో పాటు మత్రులంతా పాల్గొనున్నారు. ఈ భేటీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి తయారుచేసే వార్షిక బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలు, ప్రకటించాల్సిన కొత్త పథకాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించాల్సిన పరిశ్రమలు, విస్తరించాల్సిన పారిశ్రామికవాడలకు అంగీకారం తెలిపే విషయాలపై మంత్రివర్గం తగు నిర్ణయం తీసుకోనుంది.

పుదువైకి

రూ.3,432కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపు ● మంత్రి మురుగన్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి అభివృద్ధే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం రూ.3,432 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ పేర్కొన్నారు. ఆదివారం పుదుచ్చేరిలో ఒకరోజు పర్యటనకు వెళ్లిన కేంద్రమంత్రి మురుగన్ మీడియాతో మాట్లాడుతూ, పుదుచ్చేరి రాష్ట్రానికి నిధులు కేటాయించడంతో పాటు ఇగ్మర్ ఆస్పత్రికి రూ.1,450కోట్లు కేటాయించినట్లు తెలపారు. కిసాన్ గుర్తింపు కార్డులున్న రైతులకిచ్చే రుణం రూ.5లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ రుణాలను పుదుచ్చేరిలోని 16వేల మంది రైతులు పొందవచ్చని తెలిపారు. త్రాగునీటి పథకానికి రూ.186కోట్లు కేటాయించామని, అంతేకాకుండా రూ.12లక్షల వరకు పన్నులు చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. ఇక తమిళనాడు రాష్ట్రంలో 2014కు ముందు రైల్వే పథకాల నిమిత్తం రూ.800కోట్లు మాత్రమే కేటటాయించారని, ఆ తర్వాత రూ.6వేల కోట్ల బుక కొత్త రైల్వే మార్గం కోసం విడుదల చేసినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోని ప్రధాన అంశాలను కేంద్రమంత్రి వివరించారు. ఇదిలా ఉండగా, పుదుచ్చేరిని ఫైనాన్స్ కమిషన్‌లో ఎందుకు చేర్చలేదు? ఈ రాష్ట్రానికి గత ఏడాది కేటాయించిన నిధుల కంటే తక్కువ కేటాయించింది ఎందుకని? విలేకర్లు ప్రశ్నించడంతో కేంద్రమంత్రి మురుగన్ ఆ సమావేశం నగంలోనే వెళ్లిపోయారు.

రాష్ట్రంలో

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 38మంది ఐఏఎస్ అధికారుల బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యేక ప్రణాళికా శాఖ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సజీవన్‌ను నియమించారు. సహకార సంఘాల రిజిస్ట్రారుగా కె.నందకుమార్, కోవై జిల్లా కలెక్టర్‌గా పవన్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. కాగా, సహకార శాఖలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ జె.రాధాకృష్ణన్‌ను తమిళనాడు విద్యుత్ బోర్డు చైర్మెన్‌గా, ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యా ప్రద సాహూను పౌరసరఫరాల శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వినీత్‌ను తమిళనాడు ఆరోగ్య శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వి.కలయరసి బీసీ, ఎంబీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, స్థానిక సంస్థల డైరెక్టర్‌గా పనిచేస్తున్న కిరణ్ కురాల తమిళనాడు తాగునీటి బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఎంపీసీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆల్బీజాన్ వర్గీస్ తమిళనాడు పవర్ జనరేట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైయ్యారు. కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్‌ను తమిళనాడు స్కిల్ డెవెలెప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఆగని శ్రీలంక నావికాదళం

దాడులు

● 14 మంది రామేశ్వరం జాలర్ల అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం దాడులు కొనసాగుతుండడంతో రాష్ట్రానికి చెందిన జాలర్లు ఆందోళన చెందుతున్నారు. తాజాగా, సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని రామేశ్వరానికి చెందిన 14 మంది జాలర్లను లంక నావికా దళం అరెస్ట్ చేసింది. రామేశ్వరం, తంగచ్చిమఠం ప్రాంతాలకు చెందిన జాలర్లు శనివారం చేపల వేటకు వెళ్లారు. ఉత్తర మన్నార్ ప్రాంతంలో ఆదివారం వేకువజామున జాలర్లు చేపలు వేటాడే సమయంలో గస్తీ పడవల్లో వచ్చిన శ్రీలంక నావికా దళం జాలర్లను చుట్టుముట్టింది. సరిహద్దులు దాటారంటూ తంగచ్చిమఠానికి చెందిన జాన్ బోస్ పడవలో రామేశ్వరం, పాంబన్ ప్రాంతాలకు చెందిన 11 మంది జాలర్లు, తంగచ్చిమఠానికి చెందిన ఎస్.సుధన్ పడవలోని ముగ్గురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. వారిని మన్నార్‌లోని కోస్ట్ గార్డ్ శిబిరానికి తరలించారు. జాలర్ల అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన రామేశ్వరం జాలరి సంఘాలు, వారిని సత్వరం విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రైలు ప్రయాణంలో భద్రతపై

మహిళలకు అవగాహన


మహిళా ప్రయాణికులకు సూచనలిస్తున్న రైల్వే ఇన్‌స్పెక్టర్ ప్రియా మోహన్

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో సురక్షితమైన, భద్రత కలిగిన ప్రయాణంపై రైల్వే పోలీసులు మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. వేలూరు సమీపంలో రెండు రోజుల క్రితం మహిళా బోగీలో ప్రవేశించిన సైకో, ఒంటరిగా ఉన్న గర్భవతిపై అత్యాచార యత్నం చేసి, ఆమెను రైలు నుంచి తోసేసిన ఘటన కలకలం రేపింది. ఈ వ్యవహారంపై రైల్వే పోలీసు శాఖ తీవ్రంగా స్పందించింది. రైళ్లలోని మహిళా బోగీల్లో రైల్వే పోలీసులను నియమించడంతో పాటు అన్ని స్టేషన్‌లో రైళ్లను తనిఖీ చేస్తోంది. ఈ నేపథ్యంలో, తిరునల్వేలి జంక్షన్‌కు ఆదివారం ఉదయం తిరుచ్చి-తిరువనంతపురం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ చేరుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ప్రియ మోహన్, ఎస్ఐ రామకృష్ణన్, ప్రత్యేక విభాగం ఎస్ఐ మత్తమిళ్ సెల్వన్ నేతృత్వంలోని పోలీసులు అన్ని బోగీలు పరిశీలించి, రైలులో ప్రయాణిస్తున్న మహిళలకు సలహాలు ఇచ్చారు. బోగీల్లో ఒక్కరే ప్రయాణించాల్సి వస్తే, పక్క బోగీలో ప్రయాణికులతో కలసి ప్రయాణించాలని మహిళలకు సూచించారు.

పద్దెనిమిది ఏళ్లలోపుంటే ఆన్‌లైన్ గేమ్ నిషేధం



ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నగదు చెల్లించి ఆడే ఆన్‌లైన్ గేమ్‌ను క్రమబద్ధీకరించేలా రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. దీని ద్వారా ఆన్‌లైన్ జూద క్రీడల్లో 18 ఏళ్ల నిండని వారు పాల్గొనడంపై ప్రభుత్వం నిషేధం విధించింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నసీముద్దీన్ నేతృత్వంలో తమిళనాడు ఆన్‌లైన్ గేమింగ్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ప్రస్తుతం ఇప్పటివరకు చేపట్టిన చర్యల వివరాలను ప్రభుత్వానికి నివేదికగా సమర్పించింది. దీనిపై అదనపు ప్రధాన కార్యదర్శి నీరజ్‌కుమార్ విడుదల చేసిన ప్రకటనలో... 18 ఏళ్ల నిండనివారు ఆన్‌లైన్ గేమ్ ఆడేందుకు నిషేధం విధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఈ గేమ్ ఆడేవారికి 30 నిమిషాలకు ఒకసారి హెచ్చరిక మెసేజ్ పంపనున్నామన్నారు. ఈ నిషేధం ఆదివారం నుంచి అమలుకు వచ్చినట్లు నీరజ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులకు

వ్యాయామ పాఠాలు

● వచ్చే విద్యా సంవత్సరంలో
1 నుండి ప్లస్-2 వరకు పాఠ్యపుస్తకాలు
● విద్యాశాఖ ప్రకటన

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో 1 నుండి ప్లస్‌టూ వరకు వ్యాయామ పాఠ్యాంశాలు అమలుపరచనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు సుమారు 70వేలకు పైగావున్నాయి. పాఠశాలల్లో ఒక్కొక్క పాఠ్యంశానికి తరగతులు నిర్వహిస్తున్నట్లే, క్రీడలకు వారంలో రెండు తరగతులు కేటాయించారు. ఈ క్రీడా విభాగంలో విద్యార్థులు మైదానాలకు వెళ్లి క్రీడలకు సంబంధించిన మెళకువలు నేర్చుకుంటున్నారు. 1975లో అన్ని పాఠశాలల్లో వ్యాయామానికి సంబంధించి క్రీడలపై ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నప్పటికి, ఆ తరగతుల కంటూ ప్రత్యేకంగా పాఠ్యపుస్తకాలు ముద్రించలేదు. అయినా వార్షిక పరీక్షల్లో వ్యాయామక్రీడలకు సంబంధించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదిలా వుండగా, క్రీడా పాఠ్యపుస్తకాలు లేకుండా పరీక్షలు విద్యార్థులు ఎలా రాస్తారని తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ వచ్చే విద్యాసంవత్సరం నుండి ప్లస్‌టూ వరకు వ్యాయామ క్రీడా పాఠ్యపుస్తకాలను ముద్రించి పంపిణీ చేయనున్నట్లు వివరించింది.

తిరుచెందూరులో తైపూస ఉత్సవాలు పోటెత్తిన భక్తులు

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న తైపూసం ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశీ భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. ఆదివారం ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలలో మంగళవారం తైపూసం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో, తైపూసం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు శుక్రవారం నుంచి మాల ధారణ చేసారు. కావళ్లు మోసుకొని, శరీరానికి శూలాలు గుచ్చుకొని తిరుచెందూర్‌కు పాదయాత్ర చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సముద్రంలో లభ్యమైన షణ్ముగుడి విగ్రహానికి 370 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆ వేడుకలను కోలాహలంగా జరుపుకొనేందుకు సోమవారం షణ్ముగ వార్షికోత్సవాన్ని ఈ ఆలయంలో జరుపుకోనున్నారు. తైపూసం రోజైన మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఆలయం తెరచి ఆ రోజంతా ప్రత్యేక పూజలు అర్చన, అభిషేకాలు, తీర్థవారి నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



సమాచార ధ్వని

17 నుంచి పబ్లిక్ పరీక్షల హాల్ టిక్కెట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఈ నెల 17,19 తేదీల్లో పంపిణీ చేయనున్నారు. ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు మార్చి 3 నుంచి 27వ తేది వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి ప్లస్ టూ విద్యార్థులకు ఈ నెల 17న, ప్లస్ వన్ విద్యార్థులకు ఈ నెల 19వ తేది హాల్ టిక్కెట్లు అందించాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వ పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

రేపు పనిచేయనున్న వండలూరు జూ

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్ మంగళవారం యధావిధిగా పనిచేయనుంది. ఈ పార్క్‌లో వారాంతపు పనుల కారణంగా ప్రతి మంగళవారం సెలవు ఉంటుంది. ఈ నేపథ్యంలో, ఈ నెల 11వ తేది తైపూసం సందర్భంగా ప్రభుత్వ సెలవు కావడంతో ప్రజల సౌకర్యార్థం మంగళవారం జూ పార్క్ యధావిధిగా పనిచేస్తుందని పార్క్ అధికారులు తెలిపారు.

13న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి తిరువిక సిప్కాట్‌లో ఉన్న తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ శిక్షణా కేంద్రంలో ఈ నెల 13న పుట్టగొడుగుల పెంపకం, 14న తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో పుట్టగొడుగల పెంపకం, హార్వెస్టింగ్, మార్కెటింగ్, తేనెటీగల పెంపకానికి సంబంధించిన పరికరాలు, నిర్వహణ మెళకువలు, తేనె ఉత్పత్తుల సేకరణ, ప్రాసిసెంగ్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. వివరాలకు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

సహకార సంఘాలకు రుణ మాఫీ నగదు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న సహకార బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 2021 మార్చి వరకు 5 సవర్లలోపు నగల రుణాలు మాఫీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ఈ పథకంలో 14.52 లక్షల మందికి చెందిన రూ.5,013 కోట్ల రుణాలు మాఫీ చేసింది. మాఫీకి సంబంధించి సహకార శాఖకు ఏడాది రూ.1,000 కోట్లు ఇవ్వగా, ప్రస్తుతం రూ.606 కోట్లు విడుదల చేసింది. మాఫీ నగదును ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ ప్రాకారం ఒక్కో బ్యాంక్, సంఘానికి రావాల్సిన మొత్తం ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

టాస్మాక్ ఉద్యోగుల వేతన పెంపు చర్చలు విఫలం

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ఉద్యోగుల వేతన ఒప్పందం చర్చలు విఫలయ్యాయి. టాస్మాక్ ఎండీ కార్యాలయంలో శనివారం జరిగిన చర్చల్లో కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. 21 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పింఛన్ విధానం సహా పలు కోర్కెలను కార్మిక సంఘాలు తెలిపాయి. ఆర్థిక లోటు కారణంగా సత్వరం ఈ కోర్కెలు పరిష్కరిచలేమంటూ అధికారులు స్పష్టం చేశారు. చర్చలు విఫలం కావడంతో, తాము ఇప్పటికే ప్రకటించిన ప్రకారం టాస్మాక్ నిర్వాహక కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని కార్మిక సంఘాలు ప్రకటించాయి.

సముద్రంలో మునిగిన మరబోటు

● ఏడుగురు జాలర్లు సురక్షితం

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ధనుష్కోటి సమీపంలోని నడి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన జాలర్ల మర బోటు మునిగిన ఘటనలో ఏడుగురు జాలర్లు సురక్షితంగా బయటపడ్డారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి శనివారం సుమారు 350 మర బోటుల్లో జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లారు. ఇందులో జోసలన్ అనే వ్యక్తికి చెందిన మరబోటులో ఏడుగురు జాలర్లు ధనుష్కోటి సమీపంలో సముద్రంలో చేపలు పడుతుండగా పడవకు ఏర్పడిన రంధ్రం ద్వారా నీరు చేరి మునిగింది. నీటిలో సుమారు అరగంట సేపు ఈత కొడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న జాలర్లను మరో బోటులో జాలర్లు గుర్తించి తమ పడవలో తీరానికి చేర్చారు.

నెహ్రూ కాలంలోనే కాంగ్రెస్...!

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇంకా నెహ్రూ కాలంలోనే ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ వ్యాఖ్యానించారు. తిరుచ్చి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో 'ఇండియా' కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రాబల్యం ఉన్న పార్టీ కాంగ్రెస్ అన్నారు. కూటమి బలోపేతానికి ఆ పార్టీకి ప్రధాన బాధ్యత ఉందన్నారు. తమిళనాడులో డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఎలా కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటున్నారో, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కూటమిని బలోపేతం చేయాల్సి ఉందన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఇంకా నెహ్రూ కాలంలోనే ఉందని, అలా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమేనన్నారు. బీజేపీని అడ్డుకోవాలనే లక్ష్యం మరచి, తామే పెద్ద పార్టీగా భావించడం వల్లే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైందని ముత్తరసన్ వ్యాఖ్యానించారు.

ప్లాస్టిక్ బాటిళ్లుంటే వాహనాల లైసెన్స్ రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌కు ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకొచ్చే వాహనాల లైసెన్స్ రద్దు చేస్తామని దిండుగల్ జిల్లా కలెక్టర్ శరవణన్ హెచ్చరించారు. కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకులకు మౌలిక వసతులు కల్పిస్తున్నారా? అనే విషయాన్ని జిల్లా యంత్రాంగం పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో కొడైకెనాల్‌ను శనివారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడం గుర్తించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ద్విచక్రవాహనాలకు రూ.2,000, నాలుగు చక్రాల వాహనాలకు రూ.5,000 జరిమానా విధించాలని, ప్లాస్టిక్ బాటిళ్లు తీసుకొచ్చే వాహనాల లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

తిరువొత్తియూరు మార్గంలో రైలు పట్టాలపై ఐరన్ రాడ్, రాళ్లు

● ఆర్పీఎఫ్ విచారణ

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై పరిధిలోని తిరువొత్తియూర్ ప్రాంతంలో రైలు పట్టాలపై రాళ్లు, ఇనుపరాడ్ పెట్టిన ఘటనపై ఆర్పీఎఫ్ సిబ్బంది విచారణ చేపట్టారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి పలు ప్రాంతాలకు బయలేదేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరువొత్తియూర్ రైల్వేస్టేషన్ మీదుగా నడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు రైలు మార్గం తనిఖీ చేస్తున సమయంలో తిరువొత్తియూర్ రైల్వేస్టేషన్ పరిధిలోవున్న రైలు పట్టాలు లాక్ అవడం లేదని రైల్వే సిబ్బంది గుర్తించారు. వెంటనే సెంట్రల్, తిరువొత్తియూర్, ఎన్నూరు తదితర రైల్వేస్టేషన్ల మాస్టర్లకు సమాచారం ఇచ్చారు. అనంతరం తిరువొత్తియూర్ ప్రాంతంలోని రైలు పట్టాలపై పేర్చిన రాళ్లు, ఇనుపరాడ్ తొలగించారు. రాళ్లు, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్న ఆర్పీఎఫ్ సిబ్బంది రైలు కూల్చివేసేందుకు ఈ కుట్ర జరిగిందా? అన్న కోణంలో తిరువొత్తియూర్, పరిసర ప్రాంతంలో విచారణ జరుపుతున్నారు. ఇదిలా వుండగా రైలు పట్టాలపై వున్న ఇనుపరాడ్లు సకాలంలో గుర్తించి తొలగించినందు వల్ల పెనుముప్పు తప్పిందని, ఇందులో గ్యాంగ్‌మెన్, అధికారులను స్థానికులు అభినందించారు.



రైలు పట్టాల మధ్యలో ఇనుపరాడ్, పేర్చిన రాళ్లు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కొవ్వూర్: తండలం, ఆకాష్ నగర్, మణమేడు, తరపాక్కం, సీపీ గార్డెన్, భారతియార్ వీధి, అంబాళ్ నగర్, రోజ్ గార్డెన్, వాణిగర్ వీధి

అంబత్తూర్ సిడ్కో: పట్రవాక్కం: పిళ్లయార్ ఆలయ వీధి, సిడ్కో ఎస్టేట్ నార్త్ ఫేస్, భజన ఆలయం, బ్రాహ్మణ వీధి, యాదవ వీధి, కులకరై వీధి, కాంచనకుప్పం, రైల్వేస్టేషన్ రోడ్డు, మిల్క్ డైరీ రోడ్డు, టీఏఎస్‌ఎస్

జేజే నగర్: వేణుగోపాల వీధి, స్కూల్ వీధి, జాయిన్ వీధి, భజన ఆలయ వీధి

పోరూర్: వెంకటేశ్వర నగర్, సెంథిల్ నగర్, డైమండ్ వీధి, వెంకటేశ్వర నగర్ 1వ మెయిన్ రోడ్డు, పూత్తబేడు మెయిన్ రోడ్డు, మీనాక్షి నగర్, ఎస్ఎస్సీ బోస్ నగర్, తంగల్ వీధి, ఎస్వీఎస్ నగర్

మహిళా కానిస్టేబుల్ నగల చోరీ !

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా కానిస్టేబుల్ దగ్గరే 11 సవర్ల నగలు చోరీచేసిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరుపత్తూర్ జిల్లా పోలీసు కార్యాలయంలో నేర విభాగం కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మి, శనివారం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరింది. ఆమె వెనుకగా మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు హఠాత్తుగా లక్ష్మి మెడలోని నగలు లాక్కెళ్లారు. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిన లక్ష్మికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి అగంతకుల కోసం గాలిస్తున్నారు.

టూరిస్ట్ వీసాపై విదేశీ ఉద్యోగాలకు వెళ్లొద్దు

● సైబర్ క్రైం అదనపు డీజీపీ సందీప్ మిట్టల్

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): టూరిస్ట్ వీసాతో విదేశాలకు వెళ్లొద్దని, అవి ప్రమాదకరంగా ఉంటాయని సైబర్ క్రైం అదనపు డీజీపీ సందీప్ మిట్టల్ హెచ్చరించారు. నగరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... అధిక శాతం మంది ఉద్యోగాలకు విదేశాల కోసం వెళ్తున్నారన్నారు. వారిలో చాలా మంది రెగ్యులర్ వీసా కాకుండా టూరిస్ట్ వీసాతో వెళ్తున్నారని తెలిపారు. అక్కడ వారు బెదిరింపులకు భయపడి తప్పులు చేయడం ప్రారంభిస్తున్నారన్నారు. టూరిస్ట్ వీసాపై వెళ్లి ఆ తర్వాత వర్క్ వీసా తీసుకోవచ్చని ఎవరైనా చెబితే అలాంటి మాటలు నమ్మరాదని, అలా వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. విదేశీ ఉద్యోగాలకు ఎలాంటి వీసాతో వెళ్లాలి సహా పలు విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని అదనపు డీజీపీ సందీప్ మిట్టల్ తెలిపారు.

వీధి శునకాలకు 'రాబిస్' టీకాలు



పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరిలో వీధి శునకాలకు వెటర్నరీ, కార్పొరేషన్ సిబ్బంది రాబిస్ నిరోధక టీకాలు వేస్తున్నారు. ఈ ప్రాంతంలో శనివారం ఏడేళ్ల బాలుడు సహా ఏడుగురిపై వీధి శునకం దాడి చేసింది. వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన కార్పొరేషన్, వెటర్నరీ సిబ్బంది వేళచ్చేరి, పరిసర ప్రాంతాల్లో వీధి శునకాలను పట్టుకొని, వాటిని రాబిస్ టీకాలు వేస్తున్నారు.

రెండు వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ కోతను అరికట్టేందుకు 2వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు తమిళనాడు విద్యుత్ బోర్డుకు క్రమబద్ధీకరణ కమిషన్ అనుమతించింది. రాష్ట్రంలో రోజువారీ సరాసరీ విద్యుత్ వినియోగం 15వేల నుంచి 16వేల వరకు ఉంటుండగా, వేసవిలో పెరుగుతుంటుంది. గత ఏడాది మే 2వ తేది విద్యుత్ వినియోగం గరిష్టంగా 20,830 మెగావాట్లుగా నమోదైంది. ఈ క్రమంలో, వేసవిలో విద్యుత్ వినియోగం పెరుగనున్న నేపథ్యంలో, 2వేల మెగావాట్ల కొనుగోలుకు అనుమతించింది. మార్చి 15 నుంచి నెల వరకు ఈ కొనుగోళ్లు చేపట్టనున్నారు. వీటిలో 700 మెగావాట్లు 24 గంటలు వినియోగించనుండగా, మిగిలిన 1,300 మెగావాట్ల సాయంత్రం, రాత్రి వేళల్లో అవసరాన్ని బట్టి వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు.

గోడ కూలి కార్మికుడి మృతి

● ఇద్దరికి గాయాలు



మృతుడు అరియమలై (ఫైల్‌ఫోటో)

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అలంగానల్లూరు సమీపం వలసైగ్రామంలో ఓ పాత ఇంటిని కూల్చివేస్తున్న సమయంలో ముగ్గురు కార్మికులపై పక్కవాటు గోడ కూలిపడింది. ఈ ప్రమాదంలో కార్మికుడు మృతి చెందాడు. వలసై గ్రామంలో రఘుపతి అనే వ్యక్తికి చెందిన పాత ఇంటిని కూల్చివేయడానికి ఆదివారం ఉదయం అరియమలై (35), కార్తీక్ (35), కరుప్పసామి (32) అనే ముగ్గురు కార్మికులు వచ్చారు. ఆ ఇంటిని కూల్చుతుండగా పక్కవాటు గోడ హఠాత్తుగా కూలి ఆ ముగ్గురిపై పడింది. ఈ ప్రమాదంలో అరియమలై శిథిలాల మధ్య ఊపిరాడక ప్రాణాలు కోల్పోయాడు. తక్కిన ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదురై రాజాజీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలంగానల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

హత్యల రాష్ట్రంగా తమిళనాడు

● ఈపీఎస్ విమర్శ



ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్రావిడం అనే పదానికి భంగం కలిగించేలా అధికారంలో కొనసాగుతున్న డీఎంకే ప్రభుత్వం ప్రజలకు తగిన భద్రత కల్పించకపోవడంతో తమిళనాడు హత్యల రాష్ట్రంగా మారుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే పాలకుల నిర్లక్ష్యం, ఘర్షణలు ప్రోత్సహించడం వల్ల మహిళలకు రక్షణ కరువైందని, ఈ మూడున్నరేళ్లలో అత్యాచారం, లైంగిక వేధింపులు వంటి నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఓ మహిళా ఏడీజీపీ కార్యాలయంపై జరిగిన దాడికి సంబంధించి పోలీసు శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదని, వీటి వల్ల పోలీసు శాఖకు మచ్చ ఏర్పడిందన్నారు. విద్యార్థినులపై లైంగిక వేధింపులు, రైల్లో ప్రయాణిస్తున్న గర్భిణి మహిళపై అత్యాచారయత్నం, తదితర ఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న లైంగిక వేధింపులను అణిచివేసేందుకు చేతకాని డీఎంకే ప్రభుత్వ ముఖ్యమంత్రి స్టాలిన్ ఇప్పటికైనా మేల్కొని పోలీసులకు మరింత అధికారం అప్పజెప్పాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయించిన ఇద్దరి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బీసెంట్ నగర్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బైక్ సహా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బీసెంట్ నగర్ కళాక్షేత్ర పోలీసులు శనివారం రాత్రి ఆ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి బ్యాగు తనిఖీ చేసి, పది కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరువొట్రియూరుకు చెందిన ముస్తాఫా (34), గుమ్మిడిపూండికి చెందిన కిషోర్ (24)గా గుర్తించారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్టణంలో హోల్‌సేల్‌గా గంజాయి కొనుగోలు చేసి, రైలులో తరలించి నగరంలో విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడించారు. వీరిపై కేసు నమోదు చేశారు.

ఐదుగురు శ్రీలంక వాసులకు జైలు శిక్ష

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు, పాస్‌పోర్టుతో కెనడా వెళ్లేందుకు ప్రయత్నించి పట్టుబడిన ఐదుగురు శ్రీలంక వాసులకు తలా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఎగ్మోర్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం తీర్పునిచ్చింది. చెన్నై, తిరుచ్చి, కోవై తదితర ప్రాంతాల్లో నకిలీ పాస్‌పోర్టులు తయారుచేస్తున్నట్లు 2019లో చెన్నై క్యూబ్రాంచ్ పోలీసులకు సమాచారం తెలిసింది. అప్రమత్తమైన అధికారులు నకిలీ దస్తావేజులు, పాస్‌పోర్టులు, ఇతర ధ్రువ పత్రాలు తయారుచేసి విక్రయించే ముఠా కోసం నిఘా ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో నకిలీ పాస్‌పోర్టుల తయారీలో కీలకపాత్ర వహించిన తిరుచ్చికి చెందిన కలైసెల్వి అనే మహిళను అరెస్ట్ చేసి, విచారించారు. ఆ మహిళ దగ్గర నకిలీ పాస్‌పోర్టు పొంది కెనడా వెళ్లేందుకు ప్రయత్నించిన శ్రీలంకకు చెందిన నిశాంతన్, విమలన్, హరిహరన్, సురేంద్రన్, ప్రణవన్ సహా, వారికి సహకరించిన బ్రోకర్లు, పోలీసు అధికారులు మొత్తం 45మందిపై 2019లో క్యూబ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేసి జైలుకి తరలించారు. ఈ కేసుకు సంబంధించి ఎగ్మోర్‌లోని రెండో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎస్.ఇందులత సమక్షంలో విచారణకు వచ్చింది. క్యూబ్రాంచ్ పోలీసుల తరుపున హాజరైన ప్రత్యేక న్యాయవాది ఈ కేసును ఆధారాలతో కోర్టుకు సమర్పించారు. వీటిని పరిశీలించిన న్యాయమూర్తి ఐదుగురు శ్రీలంక వాసులకు తలా ఆరు నెలల జైలుశిక్ష, 65వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత

● రోగుల అవస్థలు



క్యూలైన్లలో వేచిన రోగులు

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత కారణంగా రోగులకు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రికి కాంచీపురం ప్రాంతాల వారు మాత్రమే కాకుండా ముసరవాక్కం, అయ్యంగార్‌కుళం, బాలుచెట్టిసత్రం, వాలాజాబాద్ తదితర ప్రాంతాల రోగులు కూడా వస్తుంటారు. ఈ నేపథ్యంలో, పురుషుల చికిత్సా విభాగంలో వైద్యుల కొరత కారణంగా రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, దీనిపై పలుమార్లు ఆరోగ్య శాఖకు విన్నవించుకున్నా ఫలితం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఉదయం 6 గంటల నుంచే ఓపీ చీటీ పొందిన రోగులు వివిధ చికిత్సా విభాగాల ముందు పెద్దసంఖ్యలో బారులు తీరుతున్నారని, వీరి బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదని రోగులు వాపోతున్నారు.

డీఎంకే ఎన్నికల హామీలపై శ్వేతపత్రం

● రాష్ట్ర బీజేపీ నేత అన్నామలై డిమాండ్

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే గత అసెంబ్లీ మేనిఫెస్టోలో చేర్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, అసెంబ్లీఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని పథకాలను తాము అధికారంలోకి వస్తే అమలుపరుస్తామని ప్రజల్ని నమ్మించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన డీఎంకే తన హామీలను మంటగలిపిందని అన్నామలై ఎద్దేవా చేశారు. హామీల గురించి ప్రస్తావించే ప్రతిపక్షనేతలను అధికారవర్గ నాయకులు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో డీఎంకే నేతలు విఫలమయ్యారని ఆరోపించారు. కొళత్తూరు నియోజకవర్గ సభ్యుడిగా 15ఏళ్లుగా ఆ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు పూర్తిచేశారో ముఖ్యమంత్రి స్టాలిన్ వివరించాలని కోరారు. మంత్రి పెరియకరప్పన్ విడుదల చేసిన ప్రకటనలో కూడా 2021 నుండి 2024 వరకు రూ.4,455.37 కోట్ల పంట రుణాలు మాఫీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఉంది. అయితే ప్రభుత్వం రూ.12,110కోట్లు రైతులకు సబ్సిడీ ఇచ్చిందని, మిగిలిన నగదును మాఫీ చేసినట్లు ఆ ప్రకటనలో స్పష్టంగా లేదన్నారు. అధికారంలోకి రావాలనే ఆశతో ఆచరణకు సాధ్యంకాని పథకాలను ప్రవేశ పెడతామని ప్రజల్ని నమ్మించిన డీఎంకే ప్రభుత్వం, కంటితుడుపు చర్యగా చిన్న మొత్తంలో ఉన్న రుణాలు మాత్రమే మాఫీచేసి దానిపై కోట్ల విలువ చేసే ప్రకటనల కోసం ఖర్చుచేస్తోందని విమర్శించిన అన్నామలై, ఎన్నికల మేనిఫెస్టోలో ఇప్పటి వరకు నెరవేర్చిన హామీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.

పాత పింఛన్ అమలుచేయకుంటే ఉద్యోగులు, ఉపాధ్యాయులు దూరం..!

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం



పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలుచేయని పక్షంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యామ్నాయ నిర్ణయం తీసుకొనే అవకాశముందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం హెచ్చరించారు. పుదుకోటలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో పాత పింఛన్ విధానం అమలుచేస్తామనే హామీని ప్రభుత్వం ఇప్పటివరకు నెరవేర్చకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అసంతృప్తిగా ఉన్నారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోగా ఈ విధానం అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఒక్కో అంశంపై తమ పార్టీ ప్రత్యేక విధానం ఉంటుందన్నారు. కూటమిలో ఉన్నాము కాబట్టి, అన్ని అంశాలు సమర్థించాల్సిన అవసరం లేదని అన్నారు. వేంగైవయల్ వ్యవహారంలో డీపీఐ మాత్రమే కాకుండా, తాము కూడా అసంతృప్తిగా ఉన్నామన్నారు. ఈ వ్యవహారం సీబీఐ విచారణకు బదిలీ చేయాలన్నారు. తిరుప్పరంగుండ్రం వ్యవహారంలో బీజేపీ నేత హెచ్.రాజా సహా హిందూ సంస్థల వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మతసామరస్యం కాపాడేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల మతపరమైన భావాలను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటోందని షణ్ముగం ఆరోపించారు.

మహిళా భక్తుల నుంచి నగల చోరీ



ఆలయం వద్ద భక్తుల తోపులాట

తిరుత్తణి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలోని ద్రౌపది అమ్మవారి ఆలయ వేడుకల్లో పాల్గొన్న మహిళా భక్తుల నుంచి నగలు చోరీచేసిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారం జరిగింది. భక్తులు ఆలయంలోకి తోసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ తోపులాటలో లోకనాథన్ భార్య జ్యోతి మెడలోని 6 సవర్లు, చెన్నై రోడ్డుకు చెందిన మాజీ విద్యుత్ శాఖ అధికారి భార్య మెడలోని 5 సవర్ల నగలను గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు దోపిడీ దొంగల కోసం గాలిస్తున్నారు.

చెట్టు కూలి విద్యార్థిని సహా ఏడుగురికి గాయాలు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దిండుగల్‌లో చెట్టు కూడిపడిన ఘటనలో విద్యార్థిని సహా ఏడుగురికి గాయాలయ్యాయి. దిండుగల్‌లోని పాత కోర్టు ప్రాంగణంలో దిండుగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి చెందిన నర్సింగ్ శిక్షణ కళాశాల, విద్యార్థుల వసతి గృహాలున్నాయి. ఆదివారం సెలవు కావడంతో విద్యార్థులను కలుసుకొనేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చారు. వారందరూ ప్రాంగణంలో కూర్చొని మాట్లాతున్న సమయంలో భారీ చెట్టు కూకటివేళ్లతో కూలింది.. ఈ ఘటనలో విద్యార్థిని సహా ఏడుగురికి గాయాలయ్యాయి. అక్కడున్న వారు క్షతగాత్రులను దిండుగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకొని చెట్ల శిథిలాలు తొలగించారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

● ఆంధ్రా యువకుడు, ఒడిశా యువతి అరెస్ట్

తిరుత్తణి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యవహారంలో ఆంధ్రాకు చెందిన యువకుడు, ఒడిశాకు చెందిన యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలోని పొన్‌పాడి చెక్‌పోస్ట్ ప్రాంతంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఆంధ్ర రాష్ట్రం నుంచి చెన్నై వస్తున్న తమిళనాడు ప్రభుత్వ బస్సులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల్లో ఓ యువకుడు, యువతి బ్యాగులు తనిఖీ చేసి, 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆ యువకుడు ఆంధ్ర రాష్ట్రానికి చెందినవాడని, అతని స్నేహితురాలు ఒడిశాకు రాష్ట్రానికి చెందినదిగా గుర్తించిన పోలీసులు వారిని కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో రిమాండ్‌కు తరలించారు.

విదేశీ మద్యం సీసాల ధ్వంసం



మద్యం కింద పోస్తున్న అధికారులు

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడుంగైయూర్ డంపింగ్ యార్డ్ విదేశీ మద్యం సీసాలను అధికారులు ధ్వంసం చేశారు. ప్యారీస్, బర్మా బజార్ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న జాక్ డేనియల్, రెమీ మార్టిన్ సహా పలు రకాల విదేశీ మద్యాన్ని 2021లో పూక్కడై ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు జార్జి టౌన్‌లోని 8వ క్రిమినల్ కోర్టులో విచారణ సాగుతున్న నేపథ్యంలో, మద్యం బాటిళ్లు ధ్వంసం చేయాలని న్యాయమూర్తి దామోదరన్ ఉత్తర్వులు జారీచేశారు. కోర్టు ఉత్తర్వులతో స్వాధీనం చేసుకున్న 806 విదేశీ మద్యం బాటిళ్లను ఆహార భద్రతా శాఖ అధికారి సతీశ్‌కుమార్ నేతృత్వంలో కార్పొరేషన్, పోలీసు శాఖ అధికారుల పర్యవేక్షణలో ధ్వంసం చేశారు.

కో-ఆప్‌టెక్స్‌లో రెండు వస్తువులు కొంటే ఒకటి ఉచితం

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కో-ఆప్‌టెక్స్ విక్రయ కేంద్రాల్లో ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు వస్తువులు కొనుగోలు చేసిన వారికి ఒకటి ఉచితంగా అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న కో-ఆప్‌టెక్స్ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... కో-ఆప్‌టెక్స్ కేంద్రాల్లో విక్రయాలు పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. వీటిలో భాగంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో రెండు వస్తువులు కొనుగోలు చేసి ఒక వస్తువు ఉచితంగా పొందవచ్చన్నారు. కొనుగోళ్లు అధికంగా జరిగే కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని తెలిపారు. చెన్నై, కోవై, కడలూరు, మదురై, సేలం, తంజావూరు, తిరునల్వేలి, వేలూరు తదితర జిల్లాలతో పాటు బెంగళూరు, ముంబై, విజయవాడ తదితర పొరుగు రాష్ట్రాల్లో ఉన్న మొత్తం 50 విక్రయ కేంద్రాలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆదివారం కూడా పనిచేస్తాయని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కో-ఆప్‌టెక్స్ తెలిపింది.

విద్యావేత్తలను మోసగిస్తున్న సర్కారు

● మాజీమంత్రి కడంబూరు రాజు



ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చదువుకోని వారిని మోసంచేయడమే కాకుండా, బాగా చదువుకున్న లెక్చరర్లను కూడా డీఎంకే ప్రభుత్వం మోసం చేస్తోందని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి కడంబూరు రాజు విమర్శించారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో ఆదివారం నిర్వహించిన అన్నాడీఎంకే జిల్లా నిర్వాహకుల సమావేశంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత జయంతి వేడుకలపై స్థానిక నేతలతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2020లో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోవున్న సమయంలో అనుబంధ కళాశాలలుగా ఉన్న 41 కళాశాలలను ఒకే జీవోతో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. ఈ కళాశాలలకు 7,300 గెస్ట్ లెక్చరర్లుగా నియమించినట్లు తెలిపారు. ఆ తర్వాత 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల డీఎంకే మేనిఫెస్టోలో ఈ గెస్ట్ లెక్చరర్లను పర్మినెంట్ చేస్తామన్న హామీ ఇచ్చిందన్నారు. అయితే వారిని పర్మినెంట్ చేయకుండా నెలకు రూ.25వేలు మాత్రమే వేతనం ఇస్తోందని దుయ్యబట్టారు.

భక్తి పేరుతో ప్రజలను మోసం చేయలేరు

● న్యాయ శాఖ మంత్రి ఎస్.రఘుపతి

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): భక్తి పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేయలేరని న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి తెలిపారు. పుదుకోట జిల్లా అరంతాంగిలో శనివారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసన సభలో మంత్రి రఘుపతి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో పన్ను తక్కువ ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు, అధికంగా పన్నులు ఇస్తున్న రాష్ట్రాలకు తక్కువ నిధులు అందిస్తూ కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంభిస్తోందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వాన్ని తరచూ విమర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్ట్, పథకాన్ని తీసుకొచ్చారా? అంటూ ప్రశ్నించారు. డీఎంకే ప్రభుత్వానికి ప్రజల మద్దతు పెరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలు పళని ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుంటారని, అలాగే ద్రావిడ మోడల్ ప్రభుత్వాన్ని ఆదరిస్తుంటారన్నారు.

క్రికెట్ విజయోత్సవంలో అపశృతి

● ఊపిరాడక యువకుడి మృతి

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ విజయోత్సవంలో పాల్గొన్న ఓ యువకుడు ఊపిరాడక మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కీల్పాక్కంలోని ఓ సంస్థలో కార్తిక్ (25) మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. టి.నగర్‌లో గది అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతను పనిచేస్తున్న సంస్థ క్రికెట్ పోటీలు జరిగాయి. అతడు మద్దతు ప్రకటించిన జట్టు విజయం సాధించింది. శనివారం రాత్రి క్రీడాకారులతో జరిగిన సంబరాల్లో అతడు పాల్గొన్నాడు. కేరింతలు కొడుతూ హఠాత్తుగా ఊపిరాడక స్పృహ కోల్పోయాడు. అతడిని 108లో నందనంలోని ఓ ప్రవేటు ఆస్పత్రి తరలించారు. అయితే చికిత్స ఫలించక శనివారం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.









వళ్లువర్‌కోట్టమ్‌కు నూతన సొబగులు

● 1600 సీటింగ్ కెపాసిటీతో ఏసీ హాలు ● రాతి రథం, స్తంభాలకు కొత్త నగిషీలు ● వచ్చే నెలలో ప్రారంభం

వళ్లువర్‌కోట్టమ్! తమిళుల పంచమవేదం 'తిరుక్కురళ్' అందించిన తిరువళ్లువర్ కీర్తి ప్రతిష్ఠతలను భావితరాలకు అందించేవిధంగా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హాయంలో నుంగంబాక్కంలో ప్రాచీన శిల్ప కళానైపుణ్యంతో నిర్మించిన అందమైన పర్యాటక భవనమిది. 1977 నుంచి ఈ ప్రాంతం నగరవాసులకే కాక ఇతర రాష్ట్రాల నుండివచ్చేవారు కూడా తప్పకుండా చూసే సందర్శనా స్థలంగా మారింది.. ఐదెకరాల్లో నిర్మించిన వళ్లువర్‌కోట్టమ్ గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో దుస్థితికి చేరుకుంది. తమ రాజకీయ ప్రత్యర్థి కరుణానిధి నిర్మించాడనే కారణమే అందుకు కారణం. స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కరుణ హయాంలో నిర్మించిన కన్నియాకుమారిలోని తిరువళ్లువర్ విగ్రహం, వివేకానంద స్మారక మండపం మధ్య అద్దాల వంతెన నిర్మించారు. ఆ కోవలోనే నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టమ్‌కు మరింత ఆకర్షణీయంగా మెరుగుపరిచేందుకు రూ.80 కోట్ల మేర మంజూరు చేశారు. ఆరుమాసాలకు పైగా ఆ ప్రాంతంలో 106 అడుగుల రాతి రథానికి నగిషీలు చెక్కారు. ఆ రథానికి ఇరువైపులా కొత్తగా రాతి స్తంభాలను నిర్మించారు. అంతే కాకుండా భవనం దిగువ 1600 మంది కూర్చునే ఏసీ హాలు కూడా కొత్తగా నిర్మించారు. దానికి సమీపంలోనే వెయ్యికిపైగా పుస్తకాలున్న గ్రంథాలయంతో కూడిన హాలు కూడా ఉంది. మొదటి అంతస్థులోని మణిమండపం మరమ్మతులు కూడా చేపట్టారు. ఆ ప్రాంతం వద్ద 1330 తిరుక్కురళ్ సూక్తులను శిలాశాసనాలుగా చెక్కారు. పెద్ద గ్రంథం రూపంలో ఉన్న సూక్తుల శాసనాలు చూపరులకు ఆకట్టుకుంటాయి. తిరుక్కురళ్ సూక్తులకు సంబంధించి 133 తైలవర్ణచిత్రాలు కూడా ఉన్నాయి. పాతబడిన ఆ తైల వర్ణచిత్రాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. రాతి రథం పైభాగానికి వెళ్లడానికి దివ్యాంగులు, వృద్ధుల కోసం లిఫ్ట్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. మినీ రెస్టారెంటు, మల్టీ ఫోర్ వెహికల్స్ పార్కింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 90 శాతం మేర పనులు పూర్తయ్యాయని, వచ్చే నెల కొత్త అందాలను సంతరించుకున్న వళ్లువర్‌కోట్టమ్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవం తర్వాత ఈ పర్యాటక స్థలాన్ని సందర్శించేందుకు వచ్చే నగరవాసులకు వళ్లువర్‌కోట్టమ్ విశేషాలతో వీడియో ప్రదర్శన కూడా ప్రారంభిస్తామన్నారు.





- ఆంధ్రజ్యోతి, చెన్నై



హీరోయిన్‌గా పరిచయం అదృష్టం : అనికా



'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్'లో ఓ దృశ్యం

తమిళ చిత్రజ్యోతి

ప్రముఖ దర్శక నటుడు ధనుష్ దర్శకత్వంలో తొలిసారి వెం డితెరకు హీరోయిన్‌గా పరిచయం కావడం తన అదృష్టం అని యువ నటి అనికా సురేంద్రన్ అన్నారు. ధనుష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడి కోబమ్'. భవిష్ - అనిక తొలిసారి హీరోహీరోయిన్లుగా పరిచయమవుతున్నారు. వీరితో పాటు ప్రియా ప్రకాష్, ప్రియాంకా మోహన్, రియా, రమ్య రంగనాథన్, వెంకటేష్ మేనన్ తదితరులు నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. నేటితరం యువత మధ్య ఉండే లవ్, బాండింగ్, ఫ్రెండ్‌షిప్, వంటి అంశాలను ఇతివృత్తంగా చేసుకుని రోమ్‌కామ్ జోనర్‌లో తెరకెక్కించారు. వుండర్ బార్ ఫిలిమ్స్, గోల్డెన్ స్పారో సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21వ తేదీ విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో నటించిన యువ నటీనటులంతా కలిసి తాజాగా నగరంలో విలేకరులతో ముచ్చటించారు. ఇందులో అనికా మాట్లాడుతూ, 'నేను తొలిసారి హీరోయిన్‌గా పరిచయమవుతున్నాను. అదీ కూడా ధనుష్ వంటి అగ్రనటుడు దర్శకత్వంలో కథానాయికగా నటించడం భాగ్యంగా భావిస్తున్నాను. నా వరకు రొమాన్స్ కొత్త. కానీ, దర్శకుడుగా ధనుష్ ఎంతో ఓపికగా చెప్పారు. అందువల్ల ఈ మూవీలో రొమాన్స్ సీన్‌లో నటించడం సులభమైంది. హీరో భవిష్ మాట్లాడుతూ, 'ఈ మూవీ ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. హాస్యంతో పాటు ప్రేమ ఇలా అన్ని అంశాలు ఉంటాయి. ధనుష్ వద్ద నాలుగేళ్ళపాటు అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశాను. 'తిరుచిత్రాంబలం', 'నానే వరువేన్', 'వాత్తి', 'కెప్టెన్ మిల్లర్' సినిమాలకు పనిచేశాను. 'రాయన్' ప్రీ ప్రొడక్షన్ సమయంలో ఈ సినిమాలో నటించే విషయాన్ని నాకు చెప్పారు. అలా ఈ మూవీలో అవకాశం వచ్చింది. ఇందులో నా సరసన అనికా సురేంద్రన్ నటించారు. నటనలో నాకంటే సీనియర్ అయినప్పటికీ.. హీరోయిన్‌గా ఆమెకు ఇది తొలి అవకాశం. షూటింగ్ సమయంలో ధనుష్ ఎంతో జాలీగా ఉంటారు. అందుకే నటనకు కొత్త అయినప్పటికీ ఈ సినిమాలో సులభంగా నటించాం' అని పేర్కొన్నారు.

పాంబన్ కొత్త వంతెనపై రెండో విడత ట్రయల్ రన్



వంతెన దాటుతున్న నావికాదళం గస్తీ నౌక

పెరంబూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం సమీపం కొత్త రైలు వంతెన ప్రారంభం కోసం శనివారం రెండో విడత ట్రయల్ రన్ నిర్వహించారు. పాంబన్ కొత్త రైలు వంతెన నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఈ వంతెనను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. జనవరి 31వ తేది ప్రారంభోత్సవం వాయిదాపడింది. ఈ క్రమంలో, రెండో ట్రయల్ రన్‌లో భాగంగా కొత్త వంతెన మధ్య ఉన్న లిఫ్ట్ వంతెన పూర్తిగా పైకిలేపగా భారత నావికాదళానికి చెందిన గస్తీ నౌక వెళ్లింది. అనంతరం లిఫ్ట్ వంతెన యథాస్థానంలోకి తీసుకొచ్చి 22 ఖాళీ బోగీలతో కూడిన రైలు నడిపారు. కాగా, పాంబన్ పాత రైలు వంతెన శిధిలావస్థకు చేరుకోవడంతో దానిపై రైళ్లు నడపడం సాధ్యం కాదని, కొత్త రైలు వంతెన ప్రారంభించిన అనంతరం, పాత రైలు వంతెన కూల్చివేయడంపై రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంటుందని మదురై డివిజన్ రైల్వే మేనేజర్ శరత్ శ్రీవాస్తవ తెలిపారు.

ఆకట్టుకున్న 'కామిక్ కాన్' ప్రదర్శన

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన కామిక్ కాన్ ప్రదర్శన ఆదివారం ముగిసింది. కామిక్ కాన్ ఇండియా (సీసీఐ)సంస్థ రెండోసారి ఈ ప్రదర్శనను శనివారం ప్రారంభించింది. ఇందులో కామిక్స్, యానిమేషన్, గేమింగ్, హాలీవుడ్ సినీ సూపర్‌హీరోల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు. కామిక్స్ ప్రపంచంలో ప్రముఖపాత్ర పోషిస్తున్న వివిధ దేశాలకు చెందిన పుస్తక రచయితలు, సినీ కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. వీక్షకులు తమకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, టోపీలు తదితరాలను కొనుగోలు చేసినట్లు ప్రదర్శన నిర్వాహకులు తెలిపారు.



ప్రదర్శనలో హాలీవుడ్ సూపర్‌హీరోల వేషధారణలో యువత సందడి

తొలి చిత్రంగా భావిస్తున్నాను

● దర్శకుడు సుశీంద్రన్



ఆడియో రిలీజ్‌లో '2కే లవ్‌స్టోరీ' చిత్ర బృందం

'వెన్నిలా కబడ్డీ కుళు' తర్వాత '2కే లవ్‌స్టోరీ' మూవీ తొలిచిత్రమనే భావన కలుగుతుందని సీనియర్ దర్శకుడు సుశీంద్రన్ అన్నారు. జగవీర్ హీరోగా పరిచయమవుతుండగా, మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి సుశీంద్రన్ దర్శకత్వం వహించారు. ఇతర పాత్రల్లో బాలశరవణన్, అంటోనీ భాగ్యరాజ్, జయప్రకాష్, వినోదిని తదితరులు నటించారు. సిటీ లైట్ పిక్చర్స్ పతాకంపై విఘ్నేష్ సుబ్రమణియన్ నిర్మించారు. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర ఆడియో రిలీజ్ వేడుకలను తాజాగా నగరంలో నిర్వహించారు. దర్శకుడు సుశీంద్రన్, సంగీత దర్శకుడు ఇమ్మాన్ కాంబినేషన్‌లో వస్తున్న పదో చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఇందులో దర్శకుడు సుశీంద్రన్ మాట్లాడుతూ, 'నేటి యువతరం జీవిత విశేషాలను వెల్లడించే రొమాన్స్ మూవీగా రూపొందించాం. నా సన్నిహితులైన దర్శకులకు సినిమా చూపించగా, వారు అభినందించారు. తొలిసారి పరిచయమవుతున్న జగవీర్‌కు, నటి మీనాక్షికి శుభాకాంక్షలు' తెలిపారు. సంగీత దర్శకుడు ఇమ్మాన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను చూసి తమను అభినందించిన దర్శకులకు ధన్యవాదాలు. అతి తక్కువ సమయంలో ఒక సినిమా ప్లాన్ చేసి, అన్ని పనులను సక్రమంగా పూర్తి చేయగల ఏకైక దర్శకుడు సుశీంద్రన్. ఆయన శారీరకంగా, ఆరోగ్యపరంగా, శక్తివంతంగా ఉండాలని కోరుకునే స్నేహితులు చాలా మంది ఉన్నారు. అలాంటి వారిలో నేను ఒకడిని' అని అన్నారు. ఆ తర్వాత మిగిలిన చిత్ర బృందం సభ్యులంతా కూడా చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

అంబత్తూరులో బహుళ ప్రయోజన భవనం

● ప్రారంభించిన మంత్రి పీకే శేఖర్‌బాబు





వ్యాయామశాలను ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంబత్తూరు జోన్ వెంకటాపురం స్కూలు రోడ్డులో ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధి నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజన భవనం, వ్యాయామశాలను హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. రూ. 18.86లక్షలతో బహుళ ప్రయోజన భవనాన్ని, రూ.21.14 లక్షలతో వ్యాయమాశాలను నిర్మించారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ, అంబత్తూరు శాసనసభ్యుడు జోసెఫ్ సామువేల్ తదితరులు పాల్గొన్నారు.



తిరుత్తణి ఆలయంలో భక్తుల రద్దీ

తిరుత్తణి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు వచ్చి స్వామి దర్శనం చేసుకుంటారు. ఆదివారం సెలవు రోజు కావడంతో తిరుత్తణి పట్టణం భక్తులతో కిటకిటలాడింది. పర్యాటకుల వచ్చిన వాహనాలతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. భక్తులు అధిక సమయంలో క్యూలైన్లలో వేచి స్వామి దర్శనం చేసుకున్నారు.

మణప్పారైలో అట్టహాసంగా జల్లికట్టు



ఎద్దును అణచివేయడానికి ప్రయత్నిస్తున్న యువకులు

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా మణప్పారై సమీపం బి.పుదుపట్టిలో సెయింట్ ఆంథోనియర్ ఆలయ పొంగల్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం జల్లికట్టు క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తిరుచ్చి, మదురై, శివగంగ, పుదుకోట, కరూరు, దిండుగల్ తదితర జిల్లాల నుండి తెచ్చిన 600 ఎద్దులను వాడివాసల్‌లో వరుసగా విడిచిపెట్టారు. వాటిని అణచివేసేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ జల్లికట్టు క్రీడల్లో మహిళలు పెంచిన ఎద్దులు కూడా పాల్గొన్నాయి. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సుమారు పది రౌండ్లలో ఈ పోటీలు కొనసాగాయి. సుమారు 300 మంది యువకులు వాడివాసల్ నుండి పరుగులు తీస్తున్న ఎద్దులను అణచివేయడానికి ప్రయత్నించారు. ఈ పోటీలలో గెలుపొందినవారికి స్టీలు బీరువా, మంచాలు, కుర్చీలు, సిల్వర్ పాత్రలను కానుగా అందజేశారు.

విజయవంతంగా ముగిసిన సీసీటీ-2025

అడయార్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్పొరేట్ క్రికెట్ టోర్నమెంట్-2025 ఆదివారం విజయవంతంగా ముగిసింది. గుండె, మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించేలా ఈ టోర్నీ నిర్వహించారు. ఈ పోటీల్లో వెస్ట్రన్ థామస్ గ్రూపు విజేతగా, రన్నరప్‌గా మెక్లిన్ ఇండియా జట్లు నిలిచాయి. ఈ రెండు జట్లకు రూ.50 వేలు, రూ.25 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. అలాగే, వివిధ సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే నిమిత్తం గుమ్మిడిపూండి అండ్ పొన్నేరి రోటరీ డిస్ట్రిక్ట్ 3232కు ప్రశాంత్ హాస్పిటల్స్ రూ.1.80లక్షల విరాళం అందజేసింది. ఈ ముగింపు వేడుకల్లో ప్రశాంత్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ కృష్ణ, టీజేఎస్ గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్, ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో ఆస్పత్రి నిర్వాహకులు

ది మెజెస్టిక్ ఫర్నిచర్ కొత్త లోగో



కొత్త లోగో ఆవిష్కరణ దృశ్యం

అడయార్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఫర్నిచర్, హస్తకళల నాణ్యతలో మంచి గుర్తింపు పొందిన ది మెజెస్టిక్ ఫర్నీచర్‌కు కొత్త లోగో ఆవిష్కరించారు. రెండు దశాబ్దాలుగా వ్యాపారం చేస్తున్న ఈ సంస్థ కొత్త లోగో ఆవిష్కరణలో ఫర్నిచర్ డైనమిక్ పవర్ ద్యుయో.. తన్వీర్, షబీర్ అహ్మద్ స్పందిస్తూ, రెండు దశాబ్దాలుగా కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా తమ ఉత్పత్తులను రూపొందిస్తున్నామన్నారు. ఉత్పత్తుల విక్రయాలను మరింతగా పెంచేలా, కస్టమర్లను ఆకర్షించేలా తమ ఫర్నిచర్ లోగో రూపొందించామన్నారు.

14న గోల్ లీగ్ పోటీలు

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ఈ నెల 14న గోల్ లీగ్ - 2025 పోటీలను నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై (ఆర్‌సీసీ) ప్రకటించింది. సామాజిక సేవా పథకాలకు నిధులు సేకరించాలన్న ఉద్దేశంతో, మద్రాస్ వెస్ట్ రౌండ్‌టేబుల్ సహా పది స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంతో నగరంలోని తమిళనాడు గోల్ ఫెడరేషన్ గ్రౌండ్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. పది టీమ్‌లు పాల్గొననున్న ఈ పోటీల్లో గెలుపొందిన టీమ్‌కు 16వ తేదీ రాత్రి జరిగే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు రోటరీ క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

అశోక్ సెల్వన్ 'ఏఎస్23' ప్రారంభం



'ఏఎస్23' ప్రారంభోత్సవ పూజా దృశ్యం

కోలీవుడ్ యంగ్ హీరో అశోక్ సెల్వన్ నటించే 23వ (వర్కింగ్ టైటిల్ 'ఏఎస్23') చిత్రం పూజా కార్యక్రమంతో ఆదివారం ప్రారంభమైంది. హ్యాపీ హై పిక్చర్స్ పతాకంపై అశోక్ సెల్వన్, అభినయ సెల్వం సంయుక్తంగా తెరకెక్కించే ఈ సినిమా ద్వారా కార్తికేయన్ రామకృష్ణన్ అనే యంగ్‌డైరెక్టర్ దర్శకుడుగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఈ మూవీలో హీరోయిన్‌గా ప్రీతి ముకుందన్ నటిస్తున్నారు. గత యేడాది కమర్షియల్‌గా హిట్ మూవీగా నిలిచిన 'పోర్ తొళిల్'ని తెరకెక్కించిన దర్శకుడు విఘ్నేష్ రాజా ఈ చిత్రానికి కథ సమకూర్చుతున్నారు. అయితే, ఇతర నటీనటులు, సాంకేతికవర్గం ప్రకటించాల్సివుంది.

నేడు పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయ కుంభాభిషేకం



పున్నైనల్లూరు ఆలయం, మారియమ్మన్

చెన్నై, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపం పున్నైనల్లూరు మారియమ్మన్ ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తంజావూరు పరిసర జిల్లాల ప్రజలకు ఈ అమ్మవారు కావలి దేవతగా ఉన్నారని 21 యేళ్ల తర్వాత ఈ ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కుంభాభిషేక ముందస్తు కార్యక్రమాలు ఈ నెల 3న ప్రారంభమైన విఘ్నేశ్వరపూజతో ప్రారంభమయ్యాయని, నవగ్రహం హోమం, ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, మహాలక్ష్మి హోమం, శాంతి హోమం నిర్వహించామని చెప్పారు. ఆదివారం ఉదయం యాగశాల పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపామన్నారు. సోమవారం ఉదయం 9.30 నుండి మహాకుంభాభిషేకం జరుగుతుందని, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, రాత్రి అమ్మవారిని ప్రధానవీధుల్లో ఊరేగిస్తామని వివరించారు.

ఊటీలో విరబూసిన 'ఫ్లేం ఆఫ్ ది ఫారెస్ట్' పుష్పాలు

ప్యారీస్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ఊటీ, ముదుమలై, మసినగుడి, సింగార, మయార్, సిరియూర్ తదితర ప్రాంతాల్లో సీతా కాలం సీజన్‌లో విరబూసిన 'ఫ్లేం ఆఫ్ ది ఫారెస్ట్' పుష్పాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వేసవి విడిదికి అనుకూలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకున్న ఈ జిల్లాలో బొటానికల్ గార్డెన్, రోజ్ గార్డెన్, సిమ్స్‌పార్క్, కాటేరి పార్క్ సహా పలుపార్కులుండగా వీటిలో రకరకాల పూలు విరబూసి, సువాసనలు వెదజల్లుతున్నాయి. పూల సోయగాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు శీతాకాలంలో ఈ జిల్లాకు వస్తుంటారు. జిల్లాలో పలు రకాల చెట్లలో అరుదుగా పూసే పుష్పాలు, ముఖ్యంగా, చెరి నేమ్ ఆఫ్ ది ఫారెస్ట్, రెడ్డీ చెట్లలో విరబూసిన పుష్పాలతో ఊటీ, ముదుమలై, మసినగుడి, సింగార, మయార్, సిరియూర్ ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ఫ్లేం ఆఫ్ ది ఫారెస్ట్ పూలు పూసిన చెట్లను దూరం నుండి చూస్తుంటే అగ్నిగోళంలా దర్శనమిస్తున్నాయని పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.





పాపం జాన్వీ కపూర్.. ఆశ అలా తీరుతుందా?



జాన్వీ కపూర్

అతిలోక సుందరి దివంగత శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ దక్షిణాది భాషల్లో ముందుగా టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'దేవర' సినిమాలో ఆమె తొలిసారి నటించారు. ఇపుడు ఈ మూవీ రెండో భాగంతో పాటు రామ్ చరణ్ చిత్రంలో నటిస్తున్నారు. అయితే, తమిళంలో డైరెక్ట్ మూవీ ద్వారా ఎంట్రీ ఇవ్వాలన్న ఆమె కోరిక మాత్రం నెరవేరడం లేదు. ఆమెను తమ చిత్రాల్లో నటింపజేసేందుకు పలువురు దర్శకులు చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఈ నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ తన సొంత బ్యానరు నీలం ప్రొడక్షన్స్ పతాకంపై నెట్‌ఫ్లిక్స్ కోసం ఓ వెబ్ సిరీస్ నిర్మించనున్నారు. ఇందులో ప్రధాన పాత్రను జాన్వీ కపూర్ పోషించనున్నారనే ప్రచారం సాగుతుంది. అయితే, దీనిపై నిర్మాణ సంస్థ లేదా జాన్వీ కపూర్ వర్గాల నుంచి క్లారిటీ రావాల్సివుంది.